సాక్షి
మంచిర్యాల
బుధవారం ■ 17 ■ మే ■ 2023



'ఎల్ మడుగు'ను చూసొద్దామా!
శివ్వారం అభయారణ్యంలో మొసళ్ల మడుగు ఉంది. ఇక్కడ అరుదైన మొసళ్లు, నీటి కుక్కలు, కృష్ణ జింకలు, నెమళ్లు, దుప్పలు, పందులు, ముళ్లపందులు ఉన్నాయి. 8లో▸



హోరాహోరీగా సీఎం కప్ పోటీలు
జిల్లాలోని ఆయా మండలాల్లో సీఎం కప్ క్రీడలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు, జ్ఞాపికలు అందజేశారు. 9లో▸

గరిష్ఠం/కనిష్ఠం
43.0 /29.0

వాతావరణం
ఆకాశం ప్రకాశవంతంగా ఉంటుంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. వడగాలులు వీస్తాయి. ఉక్కపోత అధికమవుతుంది.

న్యూస్‌రీల్

19న వైద్యుల నియామకానికి ఇంటర్వ్యూ

మంచిర్యాలటౌన్: మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో రెండు గైనకాలజిస్ట్, ఒక పిల్లల వైద్యుడి పోస్టుల నియామకానికి ఈ నెల 19న జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి సుబ్బరాయుడు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 11 గంటలకు కార్యాలయ ఆవరణలోని మీటింగ్ హాల్‌కు ఆసక్తి కలిగిన అభ్యర్థులు వారి ఒరిజినల్ సర్టిఫికెట్ల పరిశీలన కోసం, ఒక జత నకలు తీసుకురావాలని సూచించారు.

డెంగీ నివారణ ర్యాలీ



ర్యాలీ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే దివాకర్‌రావు

మంచిర్యాలటౌన్: జాతీయ డెంగీ నివారణ దినాన్ని పురస్కరించుకుని జిల్లా వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కేంద్రంలోని రాంనగర్‌లో నిర్వహించిన అవగాహన ర్యాలీని ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దోమ కాటుతోనే డెంగీ వ్యాపిస్తుందని, వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటిస్తే వ్యాధులు దరిచేరవని చెప్పారు. ప్రతీ శుక్రవారం డ్రైడే పాటించాలని, నీరు ఎక్కువ రోజులు నిల్వలేకుండా చూసుకోవాలని, దోమలు కుట్టకుండా తగిన జాగ్రత్తలను తీసుకోవాలని సూచించారు. జిల్లా వైద్యాధికారి సుబ్బరాయుడు, జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ అనిత, పాతమంచిర్యాల అర్బన్ హెల్త్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ రమేశ్, మూర్తి, శ్రీనివాస్, నాందేవ్, సత్యనారాయణ, రత్నమాల, ఏఎస్‌ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆర్టీసీ డిపో ఎదుట కార్మికుల ధర్నా



ధర్నా చేస్తున్న కార్మికులు

మంచిర్యాలఅర్బన్: తమ సమస్యలు పరిష్కరించాలని మంగళవారం ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో మంచిర్యాల డిపో ముఖద్వారం ఎదుట ఆర్టీసీ కార్మికులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. హైకోర్టు ఆదేశాలు అమలు చేస్తూ ఆర్టీసీ గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. మునుగోడు ఉప ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వ ఉద్యోగులతో పాటు పే స్కేల్ చేయాలన్నారు. సీసీఎస్‌కి బకాయిపడ్డ డబ్బులు చెల్లించాలన్నారు. సంపూర్ణ ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు గోలి శంకర్, బొట్టు లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రిని కలిసిన ఎన్‌హెచ్-63 బాధితులు



మంత్రికి సమస్యలు వివరిస్తున్న బాధితులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మంచిర్యాల-ఆర్మూర్ ఫోర్‌లేన్ జాతీయ రహదారి-63 నిర్మాణంలో తమకు జరుగుతున్న నష్టాన్ని గుర్తించి న్యాయం చేయాలని మంగళవారం కేంద్ర మంత్రి నితిన్‌గడ్కరీని బాధితులు కలిశారు. మాజీ ఎంపీ వివేక్‌వెంకటస్వామి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి ఆధ్వర్యంలో హాజీపూర్, లక్సెట్టిపేట, దండేపల్లి మండలాల పరిధిలోని ఎన్‌హెచ్-63 బాధితులు మంత్రిని కలిసి సమస్య వివరించారు. జాతీయ రహదారి విస్తరణతో పొలాలు, భూములు, ఇండ్లు పూర్తిగా కోల్పోయే పరిస్థితులను మంత్రిని దృష్టికి తీసుకువెళ్లారు. సమస్య సానుకూలంగా విన్న మంత్రి స్పందించారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా సర్వే మరోసారి చేయాలని జాతీయ రహదారి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. మంత్రిని కలిసిన వారిలో లక్సెట్టిపేట బీజేపీ అధ్యక్షుడు వీరమల్ల హరిగోపాల్, వొడ్నాల శ్యాం, బొల్లం భీమయ్య తదితరులున్నారు.

13వ రోజుకు నిరసన దీక్ష

రహదారి విస్తరణ సర్వే పనులు నిలిపివేసి తమకు న్యాయం జరిగేలా చూడాలని కోరుతూ.. ఎన్‌హెచ్-63 బాధితులు చేపట్టిన నిరసన దీక్ష కొనసాగుతోంది. మంగళవారం 13వ రోజుకు చేరింది.

నిప్పుల కొలిమి

- జిల్లాలో పెరిగిన ఎండల తీవ్రత
- 40 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు
- తట్టుకోలేక జనం ఉక్కిరిబిక్కిరి
- జాగ్రత్తలు తప్పనిసరి: వైద్యులు



మంచిర్యాలలో తలపై చున్నీ కప్పుకొని వెళ్తున్న యువతులు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: భానుడు నిప్పులు కక్కుతున్నాడు. జిల్లాలో వారంరోజులుగా పెరుగుతున్న ఉష్ణోగ్రతలకు జనం బెంబేలెత్తుతున్నారు. ఉదయం నుంచే వేడి మొదలై, చీకటి పడే వరకూ తగ్గడం లేదు. జిల్లావాసులు ఎండపూట బయటకు వెళ్లేందుకు జంకుతున్నారు. ఈ నెల 14న కాసిపేట మండలం కొండాపూర్‌లో రాష్ట్రంలోనే అత్యధికంగా 45.9డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. పెరుగుతున్న ఉష్ణోగ్రతల ప్రభావంతో వడదెబ్బతో మరణాలు సంభవిస్తున్నాయి. రెండు రోజుల్లోనే ఇద్దరు వడదెబ్బతో చనిపోయారు. పలువురు అస్వస్థతకు గురై ఆస్పత్రుల్లో చికిత్స తీసుకుంటున్నారు. అధిక ఉష్ణోగ్రతలతో జిల్లా రెడ్‌జోన్‌లో కొనసాగుతోంది.

ఓపెన్ కాస్టుల్లో మరింత వేడి

సింగరేణి కార్మికులు, వ్యవసాయ, ఉపాధిహామీ పనులకు వెళ్లే రైతులు, కూలీలు ఎండలోనే పని చేస్తూ ఇబ్బందులు పడుతున్నారు. ఓపెన్ కాస్టుల్లో సాధారణం కంటే అధికంగా ఉష్ణోగ్రతలు నమోదవుతుండడంతో సింగరేణి యాజమాన్యం ఉపశమన చర్యలు చేపట్టింది. చలువ పందిళ్లు, మజ్జిగ, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందిస్తున్నారు. పని వేళలు మార్చాలని కార్మికులు డిమాండ్ చేస్తున్నారు. రోజువారీ కార్యకలాపాలకు ఎండతో ఆటంకం ఏర్పడుతోంది. ప్రధాన మార్కెట్లు, రోడ్లపై మధ్యాహ్నం రద్దీ తక్కువగా ఉంటోంది.

పెరుగుతున్న విద్యుత్, నీటి వినియోగం

వేడి నుంచి ఉపశమనం పొందేందుకు ఏసీలు, కూలర్లు, ఫ్యాన్ల వాడకం విపరీతంగా పెరిగిపోతోంది. దీంతో విద్యుత్ డిమాండ్ పెరిగింది. గత నెలతో పోలిస్తే ఈ నెలలో విద్యుత్‌వాడకం భారీగా పెరిగింది. నీటి వినియోగం కూడా పెరిగింది. పట్టణాల్లో జనవాసాల్లో ఉన్న బోర్లలో నీరు అడుగంటింది. దీంతో జిల్లా కేంద్రంతో పాటు పలు పట్టణాల్లోని కాలనీల్లో నీటి ఎద్దడి నెలకొంది. కొన్ని చోట్ల ట్యాంకర్లతో నీటి సరఫరా జరుగుతోంది.

జాగ్రత్తలు తప్పనిసరి

ఎండ వేడిమి నుంచి తట్టుకునేందుకు ప్రతీ ఒక్కరు జాగ్రత్తలు పాటించాలని వైద్యాధికారులు సూచిస్తున్నారు. వీలైనంతవరకు ఎండకు వెళ్లకపోవడమే మేలని చెబుతున్నారు. ఒకవేళ బయటకు వెళ్తే తల, చెవులకు వేడి తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. గంటల తరబడి ఎండలో ఉండొద్దు. వదులుగా ఉన్న కాటన్ దుస్తులు ధరించాలి. తగినంత నీరు తాగాలి. నీరు, పండ్లరసాలు, ఓఆర్‌ఎస్, నిమ్మ రసం లాంటి ద్రావణాలు తీసుకోవాలి. నూనెలో వేయించిన పదార్థాలు, జంక్‌ఫుడ్ తినొద్దు. సులువుగా జీర్ణమయ్యే ఆహారం తీసుకోవాలి. వడదెబ్బ తగిలితే వైద్యులను సంప్రదించాలి. వాంతులు, విరోచనలైతే ఆస్పత్రిలో చేరి చికిత్స తీసుకోవాలి.





ఎండతో ఉక్కిరిబిక్కిరి

వేసవి ఆరంభంలో అకాల వర్షాలతో వాతావరణం చల్లబడింది. ఆ తర్వాత ఒక్కసారిగా వేడి పెరగడంతో జనం ఉక్కిరిబిక్కిరయ్యారు. తెల్లవారు జామునే వాతావరణం చల్లగా ఉండి, 10 గంటల నుంచే ఎండ సెగలు కక్కుతుండడంతో పలువురు డీహైడ్రేషన్‌కు గురవుతున్నారు. చిన్నారులు, వృద్ధులు, మహిళలు, గర్భిణులు వేడి తట్టుకోలేకపోతున్నారు. చాలావరకు ఇంటికే పరిమితమవుతున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లోనే బయటకు వెళ్తున్నారు. శుభకార్యాలు ఈ నెలలోనే అధికంగా ఉండడంతో ప్రయాణాలు చేస్తూ పలు ఫంక్షన్లకు హాజరుకావాల్సి వస్తోంది. దీంతో ఎండబారిన పడి ఉక్కిరిబిక్కిరవుతున్నారు.



గత ఆరురోజులుగా జిల్లాలో నమోదైన గరిష్ట ఉష్ణోగ్రతలు

12న	43 డిగ్రీలు
13న	44 డిగ్రీలు
14న	45.9 డిగ్రీలు
15న	44 డిగ్రీలు
16న	43 డిగ్రీలు
17న	43 డిగ్రీలు (అంచనా)

వడదెబ్బతో యువకుడి మృతి



ఎండీ సలీమ్ (ఫైల్)

మంచిర్యాలక్రైం: రోజు రోజుకు ఎండలు మండిపోతుండడంతో జనం విలవిల్లాడుతున్నారు. జిల్లాలో వడదెబ్బతో ఇద్దరు మృత్యువాత పడ్డారు. ఈ నెల14న లక్సెట్టిపేటకు చెందిన సంతోష్‌కుమార్ వడదెబ్బతో మృతిచెందిన విషయం తెలిసిందే. మంగళవారం జిల్లా కేంద్రంలోని జాఫర్‌నగర్‌కు చెందిన మహ్మద్ సలీమ్ (28) వడదెబ్బతో మృతిచెందాడు. సలీమ్ కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. కాగజ్‌నగర్‌కు చెందిన మహ్మద్ కలీమ్-నసీమాబాను దంపతులు 26 ఏళ్ల క్రితం మంచిర్యాలకు వలసవచ్చారు. వీరి కుమారుడు సలీమ్ సివిల్ కన్‌స్ట్రక్షన్ పని చేసుకుంటూ జీవనం సాగించేవాడు. ఇతడికి 18 నెలల క్రితం సభాఫాతిమాతో వివాహమైంది. సోమవారం పని నిమిత్తం సలీమ్ బయటకు వెళ్లి రాగా వాంతులు, విరోచనాలయ్యాయి. అతడిని స్థానిక ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించగా మంగళవారం తెల్లవారుజామున కరీంనగర్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు.

'నకిలీ విత్తనాలను అరికట్టాలి'



పాల్గొన్న కలెక్టర్ సంతోష్, అధికారులు

మంచిర్యాలఅగ్రికల్చర్: నకిలీ విత్తనాల, రవాణా, విక్రయాలను అరికట్టి రైతుల సంక్షేమానికి కృషి చేయాలని రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్‌శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి సూచించారు. మంగళవారం హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా డీజీపీ అంజనీకుమార్, వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్‌రావు, పోలీస్, వ్యవసాయ శాఖల ఉన్నతాధికారులతో కలిసి నకిలీ విత్తనాల నియంత్రణ, ధాన్యం కొనుగోళ్ల అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఖరీఫ్ కోసం ముందస్తు ప్రణాళికతో రైతులకు సకాలంలో నాణ్యమైన విత్తనాలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. నకిలీ విత్తనాల రవాణా, విక్రయాల నియంత్రణపై దృష్టి సారించాలని ఆదేశించారు. పోలీస్ శాఖను అనుసంధానం చేసుకొని నకిలీ విత్తనాలను అరికట్టేందుకు జిల్లా, మండల స్థాయిలో టాస్క్‌ఫోర్స్ కమిటీలను ఏర్పాటు చేయాలని చెప్పారు. ఇతర రాష్ట్రాల నుంచి నకిలీ విత్తనాలు రాష్ట్రంలోకి రాకుండా సరిహద్దుల్లో తనిఖీ కేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రభుత్వ అనుమతి, గుర్తింపు పొందిన విత్తన సంస్థల నుంచే విత్తనాలు కొనుగోలు చేసి వినియోగించుకునేలా రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. కాలం చెల్లిన, గుర్తింపు లేని నకిలీ విత్తనాలు అమ్మినవారిపై పీడీ యాక్ట్ నమోదు చేయాలని చెప్పారు. కలెక్టర్ బీ సంతోష్ మాట్లాడుతూ.. జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా నిబంధనల మేరకు రైతుల నుంచి నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు చేశామని తెలిపారు. నకిలీ విత్తనాలను అరికట్టేందుకు వ్యవసాయ అధికారులను సమన్వయం చేసుకుని రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. డీసీపీ సుధీర్ రామ్‌నాథ్‌కేకన్, జిల్లా వ్యవసాయాధికారి కల్పన, వ్యవసాయ సహాయ సంచాలకులు, మండల వ్యవసాయాధికారులు తదితరులు పాల్గొన్నారు.

రుణ లక్ష్యం ఖరారు

- రూ.358 కోట్ల బ్యాంక్ లింకేజీ టార్గెట్
- జిల్లాలో 5,977 సెల్ఫ్‌హెల్ప్ గ్రూపులు



దండేపల్లి: పొదుపు సంఘాల అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం సెర్ప్ ద్వారా ఏటా రుణాలు అందిస్తోంది. బ్యాంక్ లింకేజీ, స్త్రీనిధి ద్వారా రుణ లక్ష్యాలను నిర్దేశించి, బ్యాంక్ అధికారుల సమన్వయంతో పంపిణీ చేస్తోంది. ఇందులో భాగంగా 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి జిల్లాకు బ్యాంక్ లింకేజీ రుణ లక్ష్యాన్ని ఖరారు చేసినట్లు సెర్ప్ అధికారులు తెలిపారు. రానున్న మార్చి 31 వరకు నిర్దేశించిన లక్ష్యాన్ని చేరుకోవాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఈమేరకు జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు ఏపీఎం, సీసీలకు ఆదేశాలు జారీ చేశారు. 2022-23 ఆర్థిక సంవత్సరంలో ఇచ్చిన లక్ష్యాన్ని పూర్తిచేసినట్లే ఈసారి కూడా అదే స్ఫూర్తితో ముందుకు సాగి లక్ష్యం చేరుకోవాలని అధికారులు సూచించారు. జిల్లాలోని 5,977 ఎస్‌హెచ్‌జీలకు ఈ ఏడాది బ్యాంక్ లింకేజీ రుణాల కింద రూ.358 కోట్ల లక్ష్యాన్ని విధించారు. వీలైతే లక్ష్యాన్ని మరింత పెంచనున్నట్లు అధికారులు తెలిపారు. రుణ లక్ష్యాన్ని చేరుకునేందుకు పక్కా ప్రణాళికతో ముందుకెళ్లాలని ఉన్నతాధికారులు కింది స్థాయి వారికి సూచించారు. జిల్లాలో కొన్ని మండలాల్లో వీవోఏలు తమ సమస్యల పరిష్కారానికి సమ్మెలో కొనసాగుతున్నారు. దీంతో బ్యాంక్ లింకేజీ రుణ లక్ష్యాల ప్రక్రియ ఇంకా కొన్ని చోట్ల ప్రారంభించలేదు. జిల్లాలోని ఎస్‌హెచ్‌జీలకు అందించే బ్యాంక్ లింకేజీ రుణ లక్ష్యాన్ని ఖరారు చేశారు. లక్ష్యాన్ని చేరుకునేలా ప్రణాళిక సిద్ధం చేసినట్లు డీపీఎం స్వర్ణలత తెలిపారు.

మండలాలు, సంఘాల, లక్ష్యం వివరాలు

మండలం	ఎస్‌హెచ్‌జీలు	లక్ష్యం (రూ.కోట్లలో)
బెల్లంపల్లి	360	21
భీమారం	205	11
భీమిని	211	13
చెన్నూర్	386	20
దండేపల్లి	618	36
హాజీపూర్	196	10
జైపూర్	552	33
జన్నారం	636	36
కన్నెపల్లి	324	21
కాసిపేట	464	27
కోటపల్లి	514	34
లక్సెట్టిపేట	269	15
మందమర్రి	215	13
నెన్నెల	359	20
తాండూర్	399	25
వేమనపల్లి	269	17
మొత్తం	5,977	358

వేతన ఒప్పందంలో జాప్యం

- 22 మాసాలుగా ఎదురుచూపు
- ఈనెల 19న పదో దఫా చర్చలు
- అలవెన్స్‌ల పెంపునకు పట్టు
- ఫ్రీజింగ్ ఎత్తివేయాలని వినతి
- 'ఏడురోజుల పని' ప్రతిపాదన ఉపసంహరణకు సంఘాల డిమాండ్




శ్రీరాంపూర్: బొగ్గు గని కార్మికుల 11వ వేతన ఒప్పందంలో తీవ్ర జాప్యమవుతోంది. దేశవ్యాప్తంగా ఉన్న మూడున్నర లక్షల మంది కార్మికులు వేతనాల పెంపు ప్రకటన కోసం ఎదురుచూస్తున్నారు. 30.06.2016 నాటికి 10వ వేతన ఒప్పందం పూర్తయింది. 01.07.2021 నుంచి కొత్త వేతనాలు అమలు కావాలి. దీని కోసం ఏర్పాటైన జాయింట్ బైపార్టియేట్ కమిటీ ఫర్ ది కోల్ ఇండస్ట్రీ-11 ఇప్పటికీ తొమ్మిదిసార్లు సమావేశమైంది. 22 నెలలు గడిచినా 11వ వేతన ఒప్పందం కాకపోవడంతో కార్మికులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే జరిగిన చర్చల్లో ప్రధానమైన మినిమం గ్యారెంటీ బెనిఫిట్ 19 శాతం ఇవ్వడానికి అంగీకారం కుదిరింది. మిగతా అలవెన్స్‌లు, రిటైర్డ్ కార్మికుల పెన్షన్ తదితర డిమాండ్లపై చర్చలు జరగాల్సి ఉంది. ఇందుకు కోలిండియా యాజమాన్యం ఈనెల 19న కోల్‌కత్తాలో 10వ దఫా సమావేశం ఏర్పాటు చేసింది. ఇందులో ఐదు జాతీయ సంఘాల నేతలు అలవెన్స్‌ల పెంపుపై గట్టిగా పట్టుపట్టాలని డిమాండ్ చేస్తున్నారు. ఐతే ఐదు జాతీయ సంఘాల్లో ఏఐటీయూసీ, సీఐటీయూ, బీఎంఎస్‌లు అలవెన్సుల పెంపుపై ఒక రకంగా డిమాండ్ చేస్తుంటే హెచ్‌ఎమ్మెస్, ఐఎన్టీయూసీలు మరో రకంగా డిమాండ్ చేస్తున్నాయి. ఐతే తొమ్మిదో దఫా చర్చల్లో అలవెన్స్‌లపై నామమాత్రపు చర్చలే జరిగాయి. దీంతో 19న జరిగే చర్చలు కీలకం కానున్నాయి. ఈ చర్చల్లో తాడోపేడో తేల్చుకోవాలని కార్మిక సంఘం నేతలు భావిస్తున్నారు. జూన్‌లో కోలిండియా చైర్మన్ ప్రమోద్ అగర్వాల్ రిటైర్మెంట్ ఉంది. దీంతో ఇప్పుడు జరగబోయే చర్చల్లో సానుకూల ఫలితాలు వస్తాయని జాతీయ సంఘం నేతలు భావిస్తున్నారు. క్రితం 10వ వేజ్‌బోర్డుతో పోల్చితే ఈసారి పెరిగిన ధరలకు అనుగుణంగా ఎక్కువగానే అలవెన్స్‌లు పెరగాలని కార్మిక సంఘాల నేతలు డిమాండ్ చేస్తున్నారు.

కార్మిక సంఘాల డిమాండ్లు

- అన్ని అలవెన్స్‌లు కూడా పెరిగిన పాత బేసిక్‌పై కాకుండా కొత్త బేసిక్‌పైనే ఫిక్స్ చేయాలి.
- అన్ని అలవెన్స్‌లపై ఫ్రీజింగ్ ఎత్తివేయాలి.
- అండర్‌గ్రౌండ్ అలవెన్స్ తొమ్మిదిశాతానికి బదులుగా 10శాతం పెంచాలి. అది కూడా ఫ్రీజింగ్ లేకుండా ఇవ్వాలి.
- కన్వేయన్స్ అలవెన్స్‌లు ఒక్క శాతం ఇవ్వాలి. లేదా పెట్రోల్ ధరలు పెరుగుతుంటాయి కాబట్టి నెలకు నిర్ణీత లీటర్ల పెట్రోల్ డబ్బులు చెల్లించాలి.
- లీవ్‌లలో సిక్‌విత్ పే లీవ్‌లు 20, క్యాజువల్ లీవ్‌లు 15, జీతం లీవ్‌లు అండర్‌గ్రౌండ్ వారికి 12 మస్టర్లకు ఒకటి, సర్ఫేస్ ఉద్యోగులకు 15 మస్టర్లకు ఒకటి చొప్పున లెక్కించి ఇవ్వాలి.
- ఏడురోజుల పని విధానం ప్రతిపాదనను ఉపసంహరించుకోవాలి.
- సెలవు రోజున పని చేస్తే మంత్లీ రేటెడ్ ఉద్యోగులకు ఇచ్చే పీహెచ్‌డీపై సీలింగ్‌లను ఎత్తివేయాలి. వారికి డబుల్ మస్టర్ ఇవ్వాలి
- ప్రస్తుతం రోజుకు రూ.30 ఉన్న నైట్ షిఫ్ట్ అలవెన్స్‌ను రూ.50కి పెంచి ఇవ్వాలి
- రూ.20 లక్షల గ్రాట్యుటీని 01.04.2018 నుంచి అమలు చేయడంతో చాలామంది నష్టపోతున్నారు. దీన్ని 01.07.2016 నుంచి అమలు చేయాలి.
- డిపెండెంట్ ఉద్యోగాన్ని రద్దు చేసి దాని స్థానంలో లమ్‌సమ్ అమౌంట్ ఇవ్వాలని యాజమాన్యం పెట్టిన ప్రతిపాదనను ఉపసంహరించుకోవాలి.
- రిటైర్డ్ కార్మికులకు పెన్షన్‌ను 25శాతం నుంచి 30 శాతానికి పెంచాలి.
- పెన్షన్ ఫండ్ పెంపునకు ప్రస్తుతం టన్ను బొగ్గు అమ్మకానికి ఇస్తున్న రూ.10ని రూ.15కు పెంచాలి.

ఇళ్ల పట్టాలతో పుర ప్రజల్లో ఆత్మస్థైర్యం



పట్టా ఇస్తున్న ఎమ్మెల్యే, గ్రంథాలయ సంస్థ చైర్మన్

బెల్లంపల్లి: ఇళ్ల పట్టాల పంపిణీ ద్వారా పురప్రజల్లో ఆత్మస్థైర్యం పెంపొందుతుందని ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య పేర్కొన్నారు. మున్సిపాల్టీలోని 20, 21 వార్డుల్లో నివాసముంటున్న లబ్ధిదారులకు ఎమ్మెల్యే మంగళవారం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రేణికుంట్ల ప్రవీణ్‌తో కలిసి ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ.. సింగరేణి, ప్రభుత్వ భూములు ఆక్రమించుకుని ఇళ్లు కట్టుకుని జీవిస్తున్న ప్రజలకు రాష్ట్ర ప్రభుత్వం ఇళ్ల పట్టాలు ఇచ్చేందుకు అంగీకరించి జీవో 76, 58, 59 నంబర్లను వేర్వేరుగా జారీ చేసిందన్నారు. అర్హులంతా దరఖాస్తు చేసుకోవాలని, లబ్ధిదారులు ప్రభుత్వానికి మద్దతు నిలవాలని కోరారు. మున్సిపల్ చైర్‌పర్సన్ జక్కుల శ్వేత, వైస్ చైర్మన్ బత్తుల సుదర్శన్, కౌన్సిలర్లు గెల్లి రాజలింగు, రమేశ్, కమల, అశోక్, కోఆప్షన్ సభ్యుడు వెంకటేశ్, బీఆర్‌ఎస్ పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి విజయ్, నాయకులు కిరణ్, అన్వర్, రమేశ్, రవి, శివ పాల్గొన్నారు.

రేషన్ డీలర్ల సమస్యలు పరిష్కరించాలి



అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న డీలర్లు

మంచిర్యాలటౌన్: సమస్యలు పరిష్కరించాలని రేషన్‌డీలర్ల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్‌కు జిల్లాలోని రేషన్‌డీలర్లు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తమకు ప్రస్తుతం ఇస్తున్న నామమాత్రపు కమీషన్ స్థానంలో జూన్ నుంచి రూ.30వేల గౌరవవేతనం ఇవ్వకుంటే జూన్‌లోనే నిరవధిక సమ్మె చేస్తామని తెలిపారు. తమకు కేంద్రం ఇస్తున్న కమీషన్‌ను కూడా రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వడంలేదని ఆరోపించారు. సమస్యల పరిష్కారంలో తొమ్మిదేళ్ల నుంచి దాటవేత వైఖరితో తమను ఇబ్బందులకు గురి చేస్తోందని వాపోయారు. కరోనాతో మరణించిన డీలర్ల కుటుంబాలకు రూ.25లక్షల ఎక్స్‌గ్రేషియా, కుటుంబ సభ్యుల్లో ఒకరికి రేషన్‌షాపు ఇవ్వాలని, రూ.20లక్షల జీవిత బీమా అందించాలని, రేషన్‌షాపుల ద్వారా మరిన్ని నిత్యావసరాలు సరఫరా చేసి మినీ సూపర్ మార్కెట్లుగా తీర్చిదిద్దాలని డిమాండ్ చేశారు. సంఘం అధ్యక్షుడు వంగపల్లి రవీందర్‌రావు, కార్యదర్శి ఎం.చంద్రయ్య, కార్యనిర్వహణ అధ్యక్షుడు బీ సత్యనారాయణరెడ్డి, కోశాధికారి రావికంటి కిషన్, ఉపాధ్యక్షులు ఎస్డీ జాఫర్ అలీ, మేకల సత్యనారాయణ, ఎ.సత్తయ్య, ఎస్‌ఆర్.ప్రసాద్, కార్యదర్శులు పోటు సౌజన్య, సురేందర్, జనార్దన్ తదితరులున్నారు.

క్లుప్తంగా

'ఆదర్శ'లో ఇంటర్ ప్రవేశాలు

మంచిర్యాలఅర్బన్: 2023–24 విద్యాసంవత్సరానికి తెలంగాణ మోడల్ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం ఇంగ్లిష్ మీడియంలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మంచిర్యాల కళాశాల ప్రిన్సిపాల్ రజిని తెలిపారు. ఈ నెల 16 నుంచి 25 వరకు ఆన్‌లైన్‌లో www. tsmodel schools.comవెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆరోతరగతిలో ప్రవేశానికి పరీక్ష రాసిన 614 మంది విద్యార్థుల జాబితాను పాఠశాల నోటీస్ బోర్డుపై ఉంచినట్లు తెలిపారు. మెరిట్, రిజర్వేషన్, స్థానికత ఆధారంగా 100 మంది విద్యార్థుల జాబితాకు కలెక్టర్ ఆమోదం తర్వాత ఈ నెల 25 నుంచి అడ్మిషన్ ప్రక్రియ ప్రారంభించనున్నట్లు ఆమె పేర్కొన్నారు.

సీఎంఆర్ఎఫ్ అక్రమాలపై విచారణ జరపాలి


వినతిపత్రం ఇస్తున్న కాంగ్రెస్ నాయకులు

బెల్లంపల్లి: మండలంలోని బుధాకలాన్‌లో సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరులో జరిగిన అక్రమాలపై సమగ్ర విచారణ జరిపించాలని కోరుతూ మున్సిపల్ మాజీ చైర్మన్ మత్తమూరి సూరిబాబు మంగళవారం అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లబ్ధిదారులకు తెలియకుండానే చెక్కులు మంజూరవుతున్నాయన్నారు. అమాయకులను దళారులు తీవ్రంగా మోసగిస్తున్నారని, దీనిపై విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి మల్లారపు చిన్నరాజం, మాజీ కౌన్సిలర్ బైరి శ్రీనివాస్, నాయకులు ఎండీ అఫ్జల్, గెల్లి జయరాం పాల్గొన్నారు.

మహిళా క్లీనిక్‌లను వినియోగించుకోవాలి


ఆస్పత్రిలో పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో

జన్నారం: మహిళా ఆరోగ్య క్లీనిక్‌లను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వైద్యాధికారి సుబ్బరాయుడు అన్నారు. మంగళవారం ప్రభుత్వ ఆస్పత్రిలోని ఆరోగ్య మహిళ కేంద్రాన్ని పరిశీలించారు. మహిళలకు అందిస్తున్న సేవలపై అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆశలు, అంగన్‌వాడీలు, ఏఎన్ఎంలు మహిళా ఆరోగ్య క్లీనిక్‌లపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఆయన వెంట వైద్యాధికారి ఉమాశ్రీ, సిబ్బంది ఉన్నారు.


వీవోఏల నిరసనలో ఒకరికి అస్వస్థత

బెల్లంపల్లిరూరల్: సమస్యల పరిష్కారం కోసం వీవోఏలు చేపట్టిన నిరవధిక సమ్మె (నిరసన)లో ఒకరు అస్వస్థతకు గురయ్యారు. బెల్లంపల్లి మండల ప్రజాపరిషత్ కార్యాలయ ఆవరణలో వీవోఏలు చేపట్టిన సమ్మె మంగళవారం 30 రోజులకు చేరుకుంది. కాసిరెడ్డి పల్లె గ్రామానికి చెందిన వీవోఏ లింగంపల్లి రమేశ్ ఎండతీవ్రతతో అస్వస్థతకు గురయ్యాడు. వెంటనే తాళ్లగురిజాల పీహెచ్‌సీకి తరలించి చికిత్స అందించారు.

ఎల్ మడుగు చూసొద్దామా!

- ఆహ్లాదానికి కేంద్రంగా శివ్వారం మొసళ్ల మడుగు
- అందమైన గోదావరి.. పాపికొండ ల్లాంటి గుట్టలు
- పర్యాటకులను కట్టిపడేస్తున్న ప్రకృతి అందాలు
- వేసవిలో సందర్శకుల తాకిడి
- పర్యాటకుల సౌకర్యార్థం బోటింగ్


పాపికొండలను తలపిస్తున్న పునరావాస కేంద్రం


మడుగులో సరదాగా బోటింగ్ చేస్తూ..

జైపూర్(చెన్నూర్): గలగల పారే గోదావరి.. కనుచూపు మేర నీటిప్రవాహం.. చుట్టూ పచ్చని చెట్లు.. ఎటుచూసినా ప్రకృతి రమణీయం.. ఏడాది పొడవునా జలకళతో ఉండే నదిలో వెలసిన ప్రకృతి సిద్ధమైన నీటిమడుగు.. నది ఒడ్డున ఆనుకుని ఉండే ఎత్తైన గుట్టలు. ఇదంతా ఎక్కడో కాదు మంచిర్యాల జిల్లాలోని జైపూర్ మండలం శివ్వారం అభయారణ్యంలోని మొసళ్ల మడుగు కేంద్రం ప్రత్యేకత.. అందమైన అడవుల్లో అదో మడుగు. అద్వితీయమైన అందం. ఆశ్చర్యపరిచే జీవజాలానికి అది చిరునామా. ప్రపంచంలోనే అత్యంత అరుదైన, శరవేగంగా నశించిపోతున్న మొసళ్లు, నీటి కుక్కలు, కృష్ణ జింకలు, నెమళ్లు, దుప్పలు, పందులు, ముళ్లపందులు ఆ మడుగు.. పరిసర ప్రాంతాల్లో వందల సంఖ్యలో ఉన్నాయి. ప్రపంచ పటంలోనే శివ్వారం ఎల్.మడుగు పునరావాస కేంద్రం గుర్తించబడిందంటే ఆ ప్రాంతానికి ఉన్న ప్రాముఖ్యత అర్థం చేసుకోవచ్చు.

గుట్టపై పురాతన ఆలయాలు..



శివ్వారం నుంచి మడుగుకు సుమారు మూడు కిలోమీటర్ల దూరం ఉంటుంది. ఇక్కడికి వచ్చేందుకు పర్యాటకులు ఆసక్తి కనబరుస్తున్నారు. అయితే పర్యాటక స్థలంగా తీర్చిదిద్దితే ఇక్కడికి సందర్శకులు ఎక్కువగా వచ్చే అవకాశాలున్నాయి. శివ్వారం అటవీ ప్రాంతంలోని మొసళ్ల కేంద్రం ప్రాంతంలో గుట్టలపైన పురాతన ఆలయాలు ఉన్నాయి. వీటిని పట్టించుకోకపోవడంతో శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. కోమటి మడిగెలు అనే గుహలకు ఎంతో చారిత్రాత్మక ప్రాధాన్యత ఉంది. ఇక్కడి ఆలయంలో ఉన్న శివలింగాలు పూర్తిగా శిథిలమయ్యాయి. చారిత్రక ఆలయాలకు మరమ్మతులు చేపట్టి వాటి చరిత్రను కాలగర్భంలో కలిసిపోకుండా ప్రభుత్వం కాపాడాలని జిల్లా వాసులు కోరుతున్నారు.

ఇదీ చరిత్ర...

మంచిర్యాల జిల్లా జైపూర్ మండలంలో ఉన్న శివ్వారం మొసళ్ల మడుగు ఎంతో పురాతనమైంది. కాకతీయరాజుల కాలం నుంచే దీనికి పేరుంది. కాకతీయులు వరంగల్ నుంచి కరీంనగర్ జిల్లా (ప్రస్తుతం పెద్దపల్లి జిల్లా) మంథని నుంచి శివ్వారం మీదుగా చెన్నూరుకు రహదారిని ఏర్పాటు చేశారని చరిత్రకారులు చెబుతుంటారు. అప్పట్లో మునీశ్వరులు నివాసాలు ఏర్పర్చుకుని ఈప్రాంతంలో నివసించేవారు. ఇక్కడి సువిశాల ప్రదేశంలో గోదావరినది, దట్టమైన అటవీప్రాంతం, గుట్టలతో ఆహ్లాదకరంగా ఉంటుంది. జైపూర్ మండలం కుందారం నుంచి చెన్నూరు మండలం బీరెల్లి వరకు సుమారు 15 కిలోమీటర్ల మేర గోదావరినది విస్తరించి ఉన్న ప్రాంతాన్ని మొసళ్ల మడుగు కేంద్రంగా అటవీశాఖ గుర్తించింది.

1978లో అధ్యయనం..

పుష్పకుమార్ అనే వైల్డ్‌లైఫ్ నిపుణుడు ఈప్రాంతాన్ని 1978లో సందర్శించాడు. అప్పుడు ఇక్కడి ప్రకృతి సౌందర్యాన్ని చూసి మంత్రముగ్ధుడై ఈప్రాంతంలోని అభయారణ్యం, జీవజాతులపై అధ్యయనం చేశాడు. అప్పటి ప్రభుత్వానికి నివేదికలు సమర్పించడంతో ఈప్రాంతాన్ని మొసళ్ల పునరావాస కేంద్రంగా ప్రకటించింది. అప్పటి నుంచి మొసళ్లను అటవీశాఖ ఆధ్వర్యంలో సంరక్షిస్తున్నారు. మడుగులో సుమారు 60కి పైగా మంచినీటి, ఉప్పునీటి మొసళ్లు ఉన్నాయి. వర్షాకాలంలో మొసళ్లు సమీపంలో ఉన్న పంటపొలాల్లోకి సైతం వస్తాయి.


మడుగు ఒడ్డున సేదతీరుతున్న మొసలి

అభయారణ్యంలో అనేక జీవజాతులు

శివ్వారం అభయారణ్యం అనేక వృక్ష, జంతుజాతులకు నిలయం. చుక్కల దుప్పులు, నీలుగాయిలు, ఇప్ప పిల్లులు, అడవిపందులు, ముళ్ల పందులు, జింకలు, కొండగొర్రెలు, నీటి కుక్కలు, తదితర జంతుజాతులు ఈ అభయారణ్యంలో నివసిస్తున్నాయి. నల్లమద్ది, తిర్మణి, చెన్నెంగ, ఏగీస, బూరగ, అందుగు, సిందుగు, కొడిశ, పాల అరుదైన వృక్షజాతులున్నాయి. మొసళ్ల సంరక్షణతోపాటు వృక్ష, జంతువుల రక్షణకు అటవీశాఖ అధికారులు చర్యలు చేపడుతున్నారు.

జీవ వైవిధ్యానికి నెలవు..

జీవవైవిధ్య వెబ్‌సైట్‌లోనూ ఎల్.మడుగు విశిష్టత పొందుపర్చి ఉంది. అయినా ఈ ప్రాంతాన్ని తన పరిధిలోకి తీసుకోవాల్సిన పర్యాటక శాఖ సైతం ఎందుకు విస్మరించిందో తెలియక అటవీ శాఖ అధికారులూ తలలు పట్టుకుంటున్నారు. ఏటా నామమాత్రంగా రూ.4 లక్షలు మాత్రమే విడుదల చేస్తూ.. చేతులు దులుపుకుంటోంది.

ఇలా రావాలి..

హైదరాబాద్ నుంచి రోడ్డు, రైలు మార్గం ద్వారా రావొచ్చు. రోడ్డు మార్గంలో రాజీవ్ రహదారి మీదుగా గోదావరిఖనికి చేరుకుని అక్కడి నుంచి ఇందారం మీదుగా శివ్వారం ఎల్ మడుగు వరకు వెళ్లొచ్చు. ఇక రైళ్లో వచ్చేవారు మంచిర్యాల రైల్వే స్టేషన్‌లో దిగాలి. మంచిర్యాల ఆర్టీసీ డిపో నుంచి ప్రతీరోజు ఉదయం, మధ్యాహ్నం జైపూర్ మీదుగా శివ్వారం నుంచి చెన్నూర్‌కు ఆర్టీసీ బస్సు వెళ్తుంది. శివ్వారంలో బస్సు దిగి ఆటోలో మూడు కిలోమీటర్ల దూరం ప్రయాణిస్తే ఎల్‌మడుగుకు చేరుకోవచ్చు.

వీక్షించేలా.. వాచ్‌టవర్..

శివ్వారం మొసళ్ల సంరక్షణ కేంద్రం(ఎల్‌మడుగు)ను పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు తయారుచేసి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తామని అటవీ శాఖ అధికారులు చెప్తున్నా అవి కార్యరూపం దాల్చడం లేదు. ఏడాది కిందట అటవీశాఖ ఆధ్వర్యంలో రూ.5 లక్షల వ్యయంతో గుట్టపై వాచ్ టవర్ నిర్మించారు. దాని పైనుంచి ఇక్కడి ప్రకృతి అందాలను, మొసళ్ల మడుగును వీక్షించవచ్చు. గుట్ట కిందిభాగంలో కూర్చోవడానికి బెంచీలు ఏర్పాటు చేశారు. పర్యాటకుల సౌకర్యార్థం అటవీశాఖ ఇక్కడ బోటింగ్ ఏర్పాటు చేసింది. ఇందులో ఒక్కసారి 10 మంది వరకు ప్రయాణించవచ్చు. ట్రిప్పుకు రూ.500లు చెల్లించాల్సి ఉంటుంది.


గుట్టపై ఏర్పాటు చేసిన వాచ్ టవర్

మత్తడివాగులో మునిగి యువకుడు మృతి

లక్సెట్టిపేట(మంచిర్యాల): ప్రమాదవశాత్తు మత్తడి వాగులో మునిగి యువకుడు మృతి చెందిన సంఘటన పట్టణంలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని గోదావరిరోడ్‌కు చెందిన సమీర్(22)మంగళవారం మధ్యాహ్నం తన స్నేహితులతో కలిసి చెల్లంపేట గ్రామ శివారులోని మత్తడి వాగుకు వెళ్లాడు. స్నానం చేసేందుకు వాగులోకి దిగడంతో నీటిలో మునిగాడు. గమనించిన స్నేహితులు బయటకు తీసి స్థానిక ప్రభుత్వ సివిల్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

దాడి కేసులో ఏడాది జైలు

మంచిర్యాలక్రైం: దాడి కేసులో ఒకరికి ఏడాది జైలు శిక్ష విధిస్తూ సీనియర్ సివిల్ జడ్జి ఉదయ్‌కుమార్ మంగళవారం తీర్పునిచ్చినట్లు సీఐ రాజు, ఎస్సై తాసినొద్దీన్ తెలిపారు. 2022 అక్టోబర్ 18న ఏసీసీ సిమెంట్ కంపెనీ సమీపంలో దేవాపూర్‌కు చెందిన లారీ డ్రైవర్ దేవేంద్రనాథ్ మిశ్రా టీ తాగుతున్నాడు. మరో లారీ డ్రైవర్ చంద్రపూర్‌కు చెందిన గణేష్ అనిల్ అటుగా వెళ్తుండగా అతనిపై టీ పడింది. క్షణికావేశంలో గణేశ్ అనిల్ ఇనుపరాడ్‌తో దేవేంద్రనాథ్ మిశ్రాపై దాడి చేయడంతో తీవ్రగాయాలయ్యాయి. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడిని రిమాండ్‌కు తరలించారు. నేరం రుజువు కావడంతో ఏడాది జైలు శిక్ష విధిస్తూ జడ్జి తీర్పునిచ్చారు.

'యాక్టింగ్ మేనేజర్‌ను బదిలీ చేయాలి'

రామకృష్ణాపూర్(చెన్నూర్): మందమర్రి ఏరియాలోని ఆర్కేపీ ఓసీలో కార్మికులను ఇబ్బందులకు గురిచేస్తున్న యాక్టింగ్ మేనేజర్ రామరాజును బదిలీ చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు అక్బర్‌అలీ డిమాండ్ చేశారు. మంగళవారం ఓసీలో నిర్వహించిన గేట్‌మీటింగ్‌లో ఆయన మాట్లాడుతూ భోజన విరామ సమయంలోనూ భోజనం చేయనీయకుండా కార్మికులను వేధిస్తున్నాడని, ఎండల తీవ్రతతో కార్మికులు విధులకు గైర్హాజరైతే సస్పెండ్ లెటర్లు ఇచ్చి భయభ్రాంతులకు గురిచేస్తున్నాడని, ఏసీలు లేని భారీ వాహనాలను నడపాలేమని ఈపీ ఆపరేటర్లు చెబుతున్నా వారిని బలవంతంగా పనులకు పంపిస్తున్నాడని ఆరోపించారు. సమావేశంలో నాయకులు ఇప్పకాయల లింగయ్య, అంజనేయులు, సంపత్‌కుమార్, రామకృష్ణ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

జన్నారం: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై సతీష్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని తొమ్మిది గుడిసెపల్లి గ్రామానికి చెందిన దామెరకొండ రాజన్న (68) జన్నారంలో కత్తులు, గొడ్డళ్లను సానపెట్టే పని చేసేవా డు. మంగళవారం సాయంత్రం పని ముగించుకుని ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళ్తుండగా వెనుక వైపు నుంచి వచ్చిన కారు ఢీ కొట్టింది. తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి ఇద్దరు భార్యలు, ముగ్గురు కూతుర్లు, నలుగురు కుమారులు ఉన్నారు.

ఇంటికి వస్తున్నానని చెప్పి తిరిగిరాని లోకాలకు..

ఆసిఫాబాద్‌రూరల్: పని నిమిత్తం మహారాష్ట్రకు వెళ్లిన వ్యక్తి ఇంటికి ఫోన్ చేసి బస్సులో వస్తున్నానని చెప్పి రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై రాజేశ్వర్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని మేకలవాడకు చెందిన సరస్వతుల విశ్వనాథ్ (33) భార్య మంగతో కలిసి మంచిర్యాలలో కూలిపని చేసుకుంటు జీవనం సాగిస్తున్నాడు. సోమవారం పని నిమిత్తం మహారాష్ట్రకు బస్సులో వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో సాయంత్రం భార్యకు ఫోన్ చేసి వస్తున్నానని చెప్పాడు. ఆతర్వాత ఫోన్ స్విచ్‌ఆఫ్ వచ్చింది. మంగళవారం ఉదయం వాంకిడి, ఆసిఫాబాద్ ప్రధాన రహదారిపై ఇప్పల్ నవేగాం వద్ద శవమై కనిపించాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. మృతుని భార్య మంగ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులకు ఆర్‌వోఆర్ అమలు చేయాలి

శ్రీరాంపూర్(మంచిర్యాల): కంపెనీలో పనిచేస్తున్న ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులకు ఆర్‌వోఆర్ కచ్చితంగా అమలు చేయాలని సింగరేణి ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ కేంద్ర ప్రధాన కార్యదర్శి ఆంతోటి నాగేశ్వర్‌రావు అధికారులను కోరారు. మంగళవారం ఎస్సార్పీ 1, ఎస్సార్పీ 3, ఆర్కే 6, ఆర్కే 7 గనులను సందర్శించారు. ఈ సందర్భంగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఆర్కే గ్రూప్ ఏజెంట్ రాయుడును మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులకు కల్పించిన చట్టబద్ధ హక్కులన్నింటిని కాపాడాల్సింది కంపెనీ అధికారులే అన్నారు. అసోసియేషన్ సభ్యులంతా ఐక్యంగా ఉండి హక్కులు సాధించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ బ్రాంచి కన్వీనర్ డేగల ప్రవీణ్‌కుమార్, నాయకులు పత్తి ప్రవీణ్, వేల్పుల ప్రవీణ్, అందె వెంకటేశ్, సతీశ్, నరేశ్, దేవేందర్, తిరుపతి, క్రాంతి, ప్రతాప్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.


ఏజెంట్‌ను సన్మానిస్తున్న నాగేశ్వర్‌రావు

మెరుగైన వేతన ఒప్పందం సాధిస్తాం

- ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి వాసిరెడ్డి సీతారామయ్య

శ్రీరాంపూర్(మంచిర్యాల): బొగ్గు గని కార్మికులకు మెరుగైన 11వ వేతన ఒప్పందం సాధిస్తామని ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి వాసిరెడ్డి సీతారామయ్య అన్నారు. మంగళవారం ఆయన ఆర్కే5బి గనిపై నిర్వహించిన గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. ఇప్పటికే 19 శాతం మినిమం గ్యారెంటీ బెనిఫిట్ సాధించామని, మిగిలిన అలవెన్సులపై ఈ నెల 19న జరిగే సమావేశంలో చర్చిస్తామన్నారు. ఫ్రీజింగ్ లేకుండా అండర్ గ్రౌండ్ అలవెన్సును 9 నుంచి 10 శాతంకు పెంచాలని డిమాండ్ చేస్తామన్నారు. రిటైర్డ్ కార్మికుల పెన్షన్, కాంట్రాక్ట్ కార్మికుల డిమాండ్లపై చర్చిస్తామన్నారు. తమ డిమాండ్లకు యాజమాన్యం అంగీకరించకుంటే పెద్దఎత్తున ఆందోళన చేస్తామన్నారు. సమావేశంలో ఆ యూనియన్ కేంద్ర కార్యదర్శి ముస్కె సమ్మయ్య, ఏరియా కార్యదర్శి ప్రసాద్‌రెడ్డి, నాయకులు గునిగంటి నరసింగరావు, సారయ్య, విశ్వనాథ్‌రెడ్డి, కుక్కల కిష్టయ్య, పాని రాజయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సీతారామయ్య

'భారత్ బచావో' జిల్లా కమిటీ ఎన్నిక

పాతమంచిర్యాల: భారత్ బచావో జిల్లా కమిటీని మంగళవారం జిల్లా కేంద్రంలో ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా కనుకుట్ల మల్లయ్య, ఉపాధ్యక్షులుగా అందె మంగ, రంగు రాజేశం, సుంకర భుజంగరావు, జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎం.డి ఇబ్రహీం, కార్యదర్శిగా రాజన్న యాదవ్, కోశాధికారిగా జాగటి పోచం, కార్యవర్గ సభ్యులుగా కొండిమల్ల శ్రీనివాస్, గుమ్ముల శ్రీనివాస్, గవ్వల శ్రీకాంత్, మంతెన రాయమల్లు, కల్లెపల్లి సంజీవ్, గుంటుక సోమన్న, ఎండీ రవూఫ్, రాసపెల్లి రాజు, తిప్పారపు సారయ్య, పర్స శ్రీనివాస్, సారయ్య, బుద్ధి చంద్రమౌళి, సంగెం లక్ష్మణ్, సీరటి రాజన్న, జయకృష్ణ ఎన్నికయ్యారు.

ఇళ్లపట్టాలకోసం డీడీలు కట్టాలి

రామకృష్ణాపూర్(చెన్నూర్): సింగరేణి స్థలాల్లో ఇళ్లు నిర్మించుకున్న వారు జీవో 76 ద్వారా పట్టా పొందేందుకు వెంటనే డీడీలు చెల్లించాలని అడిషనల్ కలెక్టర్ మధుసూదన్‌నాయక్ తెలిపారు. క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 3, 4 వార్డుల్లో మంగళవారం లబ్ధిదారులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆర్డీవో వేణు, తహసీల్దార్ సంపతి శ్రీనివాస్, ఆర్ఐ నవీత్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి

దండేపల్లి: అవమాన భారంతో సోమవారం గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన దండేపల్లి మండలం కొత్తమామిడిపల్లికి చెందిన నలిమెల వినయ్(24) హైదరాబాద్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. ఆత్మహత్యాయత్నానికి ముందు తనచావుకు నలిమెల మహేష్, పత్తిపాక సంతోష్, ఎంబడి రాయలింగు, రాజమణి, నర్సయ్య కారణమని ఓ వీడియోలో రోదిస్తూ చెప్పిన తీరు పలువురిని కలిచివేసింది. ఈవిషయమై ఎస్సై ప్రసాద్‌ను సంప్రదించగా ఇంకా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు.

ఓసీపీని సందర్శించిన డైరెక్టర్

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఓసీపీని మంగళవారం సాయంత్రం కంపెనీ డైరెక్టర్ (పీపీ) జీ.వెంకటేశ్వర్‌రెడ్డి ఏరియా జీఎం సంజీవరెడ్డితో కలిసి సందర్శించారు. ఉత్పత్తి అయిన బొగ్గును సరైన సమయంలో రవాణా చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఓసీపీ పీవో పురుషోత్తంరెడ్డి, ఇందారం ఓసీపీ పీవో శ్రీనివాస్ పాల్గొన్నారు.

పబ్లిక్ న్యూసెన్స్‌కు పాల్పడిన వ్యక్తి అరెస్టు

రెబ్బెన(ఆసిఫాబాద్): పబ్లిక్ న్యూసెన్స్‌కు పాల్పడిన వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్సై భూమేశ్ తెలిపారు. మంగళవారం పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గౌతంనగర్‌లోని వెల్డింగ్‌షాప్‌లో పనిచేసే దాగం సంజయ్ ఈనెల 7న మద్యం మత్తులో రహదారి వెంట వెళ్తున్న వారిని అసభ్య పదజాలంతో దూషించడమే కాకుండా తన దుకాణంలో విద్యుత్ వైర్లకు నిప్పు పెట్టడంతో మంటలు చెలరేగి పలువురి ఇళ్లకు విద్యుత్ సరఫరా అయ్యే తీగలు కాలిపోయాయన్నారు. అంతటితో ఆగకుండా పక్కనే ఉన్న ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లో సామగ్రి ధ్వంసం చేశాడన్నారు. ప్రజల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు తెలిపారు.

జాతీయ అవార్డులకు నామినేషన్ల స్వీకరణ

మంచిర్యాలఅగ్రికల్చర్: ఈ గవర్నెన్స్ కార్యక్రమాల అమలులో నైపుణ్యాన్ని గుర్తించి ప్రోత్సహించే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ఏటా అందించే జాతీయ అవార్డులకు ఆన్‌లైన్‌లో నామినేషన్లు స్వీకరిస్తున్నట్లు మినిస్ట్రీ ఆఫ్ పర్సనల్ పబ్లిక్ గ్రీవెన్స్, పెన్షన్స్, అడ్మినిస్ట్రేటివ్ రిఫార్మ్స్, పబ్లిక్ గ్రీవెన్స్‌శాఖ అధికారి సంజీవ్ సక్సేనా తెలిపారు. మంగళవారం ఢిల్లీలోని సర్దార్ పటేల్ భవన్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర మంత్రిత్వ శాఖలు, విభాగాలు, రాష్ట్ర యూటీ, ప్రభుత్వాలు, జిల్లాలు, స్థానిక సంస్థలు విద్యా, పరిశోధన సంస్థలు (ప్రభుత్వ లేదా ప్రభుత్వేతర) 5 కేటగిరీల కింద స్టార్టప్ అర్హత ప్రమాణాల ప్రకారం వివరించడం జరిగిందన్నారు. ఇతర వివరాలకు శాఖ వెబ్‌సైట్ www. carpg. gov. in/ www. nce. gov. in లో అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ నెల 25లోగా నామినేషన్లు సమర్పించాలని, మెయిల్/హ్యాండ్/పోస్ట్/కొరియర్/ ఫ్యాక్స్/ హార్డ్ కాపీగా పంపిన నామినేషన్లు ఆమోదించబడవన్నారు. సమావేశంలో కలెక్టర్ బదావత్ సంతోష్, అదనపు కలెక్టర్ రాహుల్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.


వీసీలో పాల్గొన్న కలెక్టర్ సంతోష్

లబ్ధిదారుల వాటా చెల్లించాలి

చెన్నూర్: జూన్ మొదటి వారం నుంచి జిల్లాలో రెండో విడత గొర్రెల యూనిట్ల పంపిణీ ప్రారంభిస్తామని, లబ్ధిదారులు తమవాటా రూ.43,750 సకాలంలో చెల్లించాలని జిల్లా సహాయ సంచాలకులు రమేశ్‌కుమార్ అన్నారు. పట్టణంలోని పశు వైద్యశాలను మంగళవారం ఏడీ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సొమ్ము చెల్లించిన లబ్ధిదారులు కుల ధ్రువీకరణపత్రం, నామినీ ఆధార్‌కార్డు, బ్యాంకు ఖాతా పుస్తకం జిరాక్స్ కాపీలను స్థానిక వైద్యులకు అందజేయాలాయన సూచించారు. కార్యక్రమంలో వైద్యులు శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.